# గంధర్వలోక యాత్ర

ఉదయం ఏడు గంటలకు ప్రారంభించిన గాలివాన అర్ధరాత్రి అయినా ఏ మాత్రమూ తగ్గలేదు. దాని హోరుకు తల దిమ్మెత్తిపోతున్నది. రోజల్లా నాకు భోజనం లేదు. మా వాళ్ళు పుట్టింటికి వెళ్ళారు. నేను హోటల్లో భోజనం చేస్తున్నాను. ఈ గాలివాన మూలంగా హోటలు నాకు నూరు గజాల దూరం కాక నూరు వందల మైళ్ళ దూరమయిపోయింది.

రెండు రోజుల పాటు చీకటి కొట్టులో ఉంచితే ఎటువంటి ఆత్మప్రియత్వం కూడా దిగిపోతుందనుకుంటాను. పన్నెండు గంటలసేపు అచ్చగా నాతో నేను కాలక్షేపం చెయ్యవలసి వచ్చేటప్పటికి వెర్రెత్తి పోసాగాను. నా వంటి మానవ ద్వేషికి కూడా మానవులు కావాలన్న మాట – ద్వేషించటానికే కానివ్వండి!

ఈ విడిఖైదులవల్ల మానవ ద్వేషం తగ్గిందనుకోవద్దు. నేను మానవుడి అజ్ఞానాన్ని ఏ పరిస్థితులలోను క్షమించలేను; కాకపోతే, ఆకాశంలో సూర్యుడు ప్రకాశిస్తూ, చెట్లమీద పక్షులు కిలకిలలాడుతూ, నా శరీరంలో సంపూర్ణారోగ్యం ఉన్నంతవరకూ మానవుడి అజ్ఞానాన్ని ఒక విధంగా సహించగలను అంతే.

నా మానవ ద్వేషాన్ని సమర్థించడం మొదలుపెడితే ఒక భారతం అవుతుంది. అందుకని రెండు ముక్కల్లో చెప్పేస్తాను – రాజకీయాల్లోను, సాంఘిక విషయాల్లోనూ, విశ్వాసాల్లోనూ, సంస్కారంలోనూ సాటి మానవుడు నాకు తలవంపు తెచ్చాడు. మా నాన్న, తను బ్రాహ్మణ వైదిక కుటుంబంలో పుట్టటం వల్ల అత్యుత్తమమైన పుట్టుక పుట్టాననుకున్నప్పుడు నేను తలవంచుకున్నాను; "మా కోడలు వచ్చిన వేళావిశేషం ఏమిటో కాని అది అడుగుపెట్టినప్పటి నుంచీ మాకొక్కటీ కలిసి రాలేదు!" అని మా అమ్మ అన్నప్పుడు తలవంచుకున్నాను; మా బావమరిది వ్యాజ్యం గెలవటానికి హరనాథు భజన ప్రారంభిస్తే తలవంచుకున్నాను; నా అన్నగారు అత్తగారి దగ్గిర అయిదు వందలు తీసుకుని భార్యను కాపురానికి తెచ్చుకుంటే తలవంచుకున్నాను. తన మీద ఎవరో చెయ్యి వేసినందుకు మా పినతల్లి కూతురు చేసిన అల్లరికి తలవంచుకున్నాను. ప్రేమించకుండా భర్తలతో పాతివ్రత్యం ఆచరిస్తున్న ప్రతి యిల్లాలినీ చూసి తలవంచుకున్నాను; స్వార్థాన్నీ, లోభత్వాన్ని, అసూయనూ

సంరక్షించటానికి ఏర్పాటయిన నీతి న్యాయ చట్టాలను చూసి తలవంచుకున్నాను; దేశాలు దేశాలతో యుద్ధం చేస్తుంటే నేను తలవంచుకున్నాను. తన అల్పత్వానికీ, అజ్ఞానానికి అహంకరించి విర్రవీగే మానవుణ్ణి నేను ఎన్నటికీ చమించలేదు. మానవజాతి యావత్తూ ఒక్కసారి ఆత్మహత్య చేసుకొనేటందుకు తీర్మానం ఒకటి పెడితే దాన్ని నేను తక్షణమే బలపరుస్తాను.

## 2

గడియారం పన్నెండు కొట్టడం కూడా విన్నాను. బయట దయ్యాలు విసుగు విరామమూ లేకుండా కీచులాడుకొంటున్నై! ఆ తర్వాత నేను కునికి ఉండాలి. అకస్మాత్తుగా తలుపు చప్పుడు విని లేచాను. గడియారం కేసి చూస్తే ఒంటి గంట దాటింది.

నేను లేచింది తలుపు చప్పుడుకే అయినప్పటికీ, లేచిన కొంతసేపటికి వరకూ ఎవరో తలుపు తడుతూన్నారనేది నా బుర్రకెక్కలేదు. ఒక్కొక్కప్పుడు చప్పుడు మేలుకొని ఉన్నప్పటికంటే కలత నిద్రలో గట్టిగా వినిపిస్తుంది.

రాత్రివేళ తుఫానులో తలుపు తట్టే వాడెవరు? లేచి వెళ్ళి తలుపు తీసి చూడటానికి చాలాసేపు పస్తాయించాను. అది తలుపు చప్పుడేననీ, మా తలుపేననీ నిశ్చయించుకొని లేచి వెళ్ళి తలుపు తీశాను. మరుక్షణమే పదిటన్నుల గాలి వాన ఇంట్లో ప్రవేశించింది. అందులో ఒక భాగమల్లే ఒక పెద్ద మనిషి లోపల వచ్చి పడ్డాడు. మళ్ళీ తలుపు మూసి గడియ పెట్టడానికి నీరసంగా వున్నా నాశక్తి యావత్తూ వినియోగించవలసి వచ్చింది.

"అబ్బబ్బబ్బ! ఏమి మహాప్రళయం!" అన్నాడా పెద్దమనిషి పైనుంచి కిందికి కాలువలుగట్టుతూ.

"ఎవరు మీరు?" అన్నాను చేతిలో పట్టుకొన్న హరికేను లాంతరు ఆయన మొహానికెత్తి.

ఆ మొహం చూడగానే నాకమిత ఆశ్చర్యం వేసింది. నేను భారతదేశంలో వున్న అన్ని జాతుల మొహాలూ చూసి ఉంటాను. ప్రపంచంలో ఉండే చాలా జాతుల మొహాలలో చాలా భాగం ఫోటోల ద్వారా అయినా చూసి వుంటాను. ఈ పెద్దమనిషి మొహం ఏ జాతికీ చెందినట్టు కనిపించలేదు. ఆయనను ఫోటోతీసి చూపిస్తే విగ్రహమని నమ్మి ఉండేవాణ్ణి. చార్లీ మాకార్తే మొహమంత వికృతంగా లేదన్నమాటేకాని చార్లీ మొహం చూస్తే ఎటువంటి భావం కలుగుతుందో నాకీ పెద్దమనిషి మొహం చూస్తే అటువంటి భావమే కలిగింది. ఆయన మొహం నాకేసి తిప్పి నోరు తెరచి మాట్లాడుతుంటే ఏదో విగ్రహం మాట్లాడుతున్నట్లే ఉంది.

ఆయన నా ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పక అటు ఇటూ చూసి, "ఈ ఇంట్లో ఇంకెవ్వరూ లేరు కదూ?" అన్నాడు.

"లేరు దేనికీ?"

ఆయన దగ్గరికి వంగి రహస్యంగా "నేను గంధర్వుణ్ణి!" అన్నాడు. నేను పట్టలేని ఆశ్చర్యంతో ఆయనకేసి తేరిపార చూశాను.

నిజమే! ఆ మనిషి కళ్ళార్పటం లేదు. ఆయనను చూడగానే చార్లీమాకార్తే స్ఫురణకు రావటానికి సగం కారణం అదేనేమో. ఆయన కాళ్ళకేసి చూశాను. కాళ్ళకు ఏమాత్రము బురదలేదు. పాదాలు భూవిని ఆనుతున్నట్టే కన్పించింది. కాని వాటికీ భూవికి వెంట్రుకవాసి ఎడం ఉండే ఉంటుంది. నేలబారుగా పడుకొని చూస్తే కనిపిస్తుంది. కాని ఆపని చెయ్యడానికి నాకా సమయంలో సాహసం చాలకపోయింది. ఆయన బట్టలు నీళ్ళోడుతున్నప్పటికీ శరీరం పొడిగానే ఉంది. ఆయన బట్టలు కట్టుకున్నాడనటానికి వీలులేదు. చుట్టా చుట్టుకున్నాడు. ఒక పొర నెత్తిమీదికి కూడ వచ్చింది. అవి పుటమట్టి రంగు ముతక ఖద్దరు బట్టలని కనిపెట్టాను.

"మీరు నిజంగా గంధర్వులయితే తెలుగు ఎట్లా మాట్లాడుతున్నారు?" అన్నాను.

"మనము మనస్సులతో మాట్లాడుతున్నాం. దానికి భాష లేదు."

"మరి మన మాటలు నా చెవులు వింటున్నయ్యే?"

"చెవులకు అటువంటి భ్రమ కలిగించే శక్తి ఉన్నది. కలలో నువ్వెప్పుడూ మాటలు వినలేదా? ఒక్కొక్కసారి నిద్రలేచిన తరువాత కూడ ఆ మాటలు చెవిలో గింగురుమని మోగుతూ ఉంటై. ఆ మాటలు ఎవరు మాట్లాడినవి?"

"అ-వు-ను! కావచ్చును. అయే ఉంటుంది. అయితే మీకి ఖద్దరు బట్టలెట్లా వచ్చినై? గంధర్వులకు కూడ కాంగ్రెసు తత్వం అబ్బిందా?"

ఆయన నవ్వి "లేదు. ఒక బట్టల కొట్టులో ప్రవేశించి ఒక తాను సంగ్రహించి చుట్టుకున్నాను. మీ ప్రపంచంలో దిగంబరులను సహించలేరని తెలిసింది. నన్ను చూసి జనం గొల్లున అరచి కేకలు వెయ్యసాగారు. అదీకాక నేను మనిషినయిన తరవాత నాకు చలి బాధ ఒకటి కొత్తగా పట్టుకున్నది" అన్నాడు.

"ఆ గుడ్డలు విడిచెయ్యండి. నేను వేరే పొడి గుడ్డలిస్తాను. పైగా నాకా ఖద్దరు గుడ్డలు చూస్తే వికారం వస్తున్నది."

"నీకు ఖద్దరు సరిపడదా?"

"సరిపడదు. అవి మా దారిద్ర్యాన్నీ మా మౌఢ్యాన్నీ ఒక్కసారిగా చాటుతుంది. అంతర్జాతీయతను వెలిపెట్టేది మేము కట్టుకున్న మడి ఖద్దరు. నాకు మడి అంటే చాలా అసహ్యం!" అన్నాను.

"నాకిప్పుడు నీ తత్వం అర్థమయింది. నువు జీవితం మీద తిరగబడిన ప్రాణివి. నీ ముఖ్య లక్షణం అసంతృప్తి. మొదటి అవకాశం నీకు లభించి ఉంటే నువ్వే ఖద్దరు తత్వం స్థాపించదగినవాడివి. ఆ అవకాశం మరెవరో తీసికొన్నారు – నువు తిరగబడ్డావు. ఆగు! నిన్ను గురించి నీ కన్నా నాకు బాగా తెలుసును. లోకం నీతో ఎన్నటికి తృప్తిపడలేదు, లోకంతో నువ్వూ తృప్తిపడవు. కాని ఆ విధంగానే లోకంలో నీకు స్థానం ఉంది. లోకానికీ నీకు ఉన్న బాంధవ్యం మరొక విధంగా వుంటే నీకు తృప్తి ఉండదు. మాటవరసకు అంటున్నాను. ప్రపంచము నువు కోరినట్టు ఈ రోజున మారితే మళ్ళా దానిమీద నువు తిరగబడి తీరుతావు."

ఆయన మాటలకు నాకు ఆశ్చర్యం కలిగింది. కొద్దిసేపటికింద నేననుకున్న విషయమే ఆయన స్పష్టంగా విప్పి చెప్పాడు.

## 3

ఆయనకు నా ధోవతి కట్టుకోవటం చాతకాలేదు. నా భార్య చీరలోల పదమూడు మూళ్ళది ఒకటి వెతికి ఆయనకు చుట్టబెట్టి, నా వాలుడు కుర్చీలో ఆయనను కూర్చోబెట్టాను. అంత ఆజానుబాహువు కుర్చీలో కూర్చుంటే కుర్చీపట్టా ఏమాత్రమూ చెక్కు చెదరలేదు. ఆయన బొమ్మ మొహమూ, చుట్టుకున్న నా భర్య గళ్ళ చీరా నాకు నవ్వొచ్చింది.

ఆయనతో సంభాషించాలనే కుతూహలం జాస్తి కావటం వల్ల ఆయనను సంభాషణలోకి దించాను. ఎవరితోనన్నా మాట్లాడటానికి నేను ఆదుర్దాపడి చాలా ఏళ్ళయింది.

"మీరు భూమి మీదకొచ్చి ఎంతకాలమయింది? ఏం పని మీద వచ్చారు? మీ ప్రపపంచం ఎట్లా వుంటుంది?" అంటూ ప్రశ్న మీద ప్రశ్న వేశాను.

ఆయన తన నిశ్చలమైన కళ్ళు నాకేసి తిప్పి నవ్వుతూ, "నేను మా లోకం విడిచిపెట్టి ఇంకా పూర్తి ఒకరోజు కాలేదు. ఈ మానవ రూపం ధరించి రెండు గడియలు మాత్రమే అయింది. భూలోకాన్ని చూడదలిచినంతవరకూ నా స్వ శరీరంతోనే చూశాను. కాని మానవ శరీరం ధరించి మానవ వికారాలు కూడా తెలుసుకుంటే కాని మానవ జీవితం అర్థం కాదనిపించింది. ఈ గంటలోపుగానే క్షుద్బాధా, నొప్పి మొదలైనవి అర్థమైనై. మా లోకంలో కూడ ఇటువంటి వికారాలుంటై కాని మేమా వికారాలవల్ల బాధపడం. మీదు మిక్కిలి ఆ వికారాలు మా జీవ శక్తిని వృద్ధిచేసి మాలో చైతన్యం కలిగిస్తై. మేము వాటిని అనుభవించి ఆనందిస్తాం. మా తృష్ణలను మేము తగు మాత్రం పెరగనిచ్చి గాని తీర్చుకోము.

"మీ జీవితాలను మీరు కొద్దిగా మార్చుకుంటే తృష్ణల విషయంలో మీరు మా మాదిరిగానే అవుతారని నేను తేల్చుకున్నాను.

"నేను గమనించినంతవరకూ మీ మానవ జాతిని గురించి అభిప్రాయం ఏమంటే, మీ మేధస్సు ఇంకా చాలా లేతగా వుంది. మీలో అతి మేధావులు కూడా చాలా అసంతృప్తికరమైన స్థితిలో ఉన్నారు.

"ఒకందుకు నాకాశ్చర్యం వేస్తుంది – మీ జ్ఞానేంద్రియాల శక్తి సామర్థ్యాలకూ మీ బుద్ధి దార్ఢ్యానికీ మించిన విషయాలను గురించి జిజ్ఞాస ఎందుకు చేస్తారు? మీ కళ్ళు ఒక అణువును తప్ప స్ఫుటంగా చూడలేవు. మీ బుద్ధి నాలుగు కొలతల పదార్థాలను అవగాహన చేసుకోలేదు. కాని మీరు ప్రకృతి గీసిన గిరిలో ఉండక వెర్రిగా పోతారు. దానివల్ల మీ మెదడు మొక్కపోతున్నది. అది ఎదగటం లేదు. మెదడుకు వ్యాయామం ఇవ్వటం గురించి మీకేవిధమైన జ్ఞానమూ ఉన్నట్టులేదు. అట్లా వ్యాయామం ఇస్తున్న వాళ్ళు తప్పుగా ఇచ్చి మెదడును పాడు చేసుకుంటున్నారు.

"మీ అత్యాశ మిమ్మల్ని పాడు చేడు చేస్తున్నది. మీరు ఇసక రేణువులను గురించి నేర్చుకోదగినదంతా నేర్చుకుంటే ఎప్పటికైనా మీ సంతానం సృష్టిని గురించి నేర్చుకో గలుగుతుందేమో. కాని మీలో ప్రతివాడూ భగవంతుణ్ణి గురించి ఆలోచించేవాడే! కొందరు భగవంతుడున్నాడనే మూఢులూ, మరికొందరు లేడనే మూఢులూ!

"మీ అవసరాలు మీరెరగరు; మీకు సంబంధంలేని వాటిని గురించి ఆలోచిస్తారు; అవసరం లేని జ్ఞానంతో మీ తలకాయలు నింపుతారు; అవసరం లేని విశ్వాసాలను గట్టిగా పట్టుక వేళ్ళాడతారు; ఒకరి కొకరు అడ్డం వస్తారు. మీ ప్రక్కన ఎవరైనా నడుస్తూ మీ కాళ్ళకడ్డం వస్తుంటే సహించలేరు. కాని మీ జీవితాలకు ఇతరులు అణుక్షణమూ అడ్డంవస్తుంటే సహించటమే కాక, మీరు ఇతరుల జీవితాలకు కూడా అడ్డం వస్తారు.

"మరొక విషయం ఏమంటే, మీ వివిధ మానసిక ప్రవృత్తులను ఒకదానితో ఒకటి సమన్వయించాలనే ప్రయత్నం మీలో ఏమాత్రము కనిపించదు. మీ వేదాంతమూ, మీ మీ మతము, మీ న్యాయమూ, మీ నీతి, మీ విజ్ఞానమూ, మీ ప్రవర్తన ఒకదానికొకటి అంటవు. పరస్పర సంబంధం లేని వీటిన్నిటిని ఒక్కసారిగా మీ బుద్ధి ఎట్లా స్వీకరిస్తుందో నాకర్థం కాదు. ఒక దేశం వేరొక దేశంతో యుద్ధం చేయటం దౌర్జన్యం. అందుకుగాను సైనికులను నిర్బందించటం మరొక దౌర్జన్యం. ఇంకొకరి మీద దౌర్జన్యం చెయ్యటానికిగాను ముందు మీ మీద మీరే దౌర్జన్యం చేసుకుంటారు. బలం గలవాడు బలహీనుణ్ణి నిర్మూలించటంలో ప్రకృతి సిద్ధంగా తప్పేమీ లేదు. కాని మీ దైనిక జీవితంలో ఆ విశ్వాసాన్ని ఏమాత్రమూ ప్రకటించరు!

"మీరు ఆరాధించే దేవత్వం ఏదయితే వుందో అది మీ చట్టాల ద్వారా నిర్మూలమవుతున్నది. మీ న్యాయ చట్టం మీ స్వార్థాన్నీ ఇతర దుర్గుణాలను సంస్కరించటానికి బదులు సంరక్షిస్తున్నది.

"ఒకచోట చూశాను – ఒక మనిషి తన గొడుగు పోగొట్టుకున్నాడు. ఆ సంగతి తెలియగానే అతను నిప్పులు తొక్కిన కోతి అయి అటూ ఇటూ పరుగెత్తాడు. దారిలో ఒక పోలీసు కనిపిస్తే ఆ పోలీసుతో చెప్పాడు. ఆఖరుకు ఆ గొడుగు మరొకడి చేతిలో కనిపించింది. వెంటనే ఉగ్రుడైపోయి ఆ మనిషిని తన చేతి కర్రతో ఫెడీ, ఫెడీ నాలుగు దెబ్బలు కొట్టి ఆ చంకలో నుంచి గొడుగు లాక్కొని తన చంకలో పెట్టుకుని నిశ్చింతగా వెళ్ళసాగాడు. అంత ఆదుర్థాపడ్డవాడు గొడుగు దొరకగానే వేసుకుంటాడనుకున్నాను. వేసుకోలేదు. ఏంచేస్తాడో చూస్తామని అతన్ని వెంబడించాను. ఒక ఆడమనిషి ఎదురుపడ్డది. ఆమె అతనితో ఏదో మాట్లాడి ఆ గొడుగు తనకిమ్మని అడిగింది. సంతోషంతో ఇచ్చేశాడు.

"మరొకచోట ఒక మగవాడూ ఆడదీ కలసి నడుస్తున్నారు. ఎదురుగా వస్తున్న మగవాడొకడు ఆమెను చూసి నవ్వాడు. వెంటనే ఆమె పక్కన నడుస్తున్న మగవాడు చెప్ప శక్యం కాకుండా మండిపడి అతన్ని నానా మాటలూ అన్నాడు. తరవాత ఇద్దరూ సాగిపోయినారు. ఆ మనిషి అతనితో మాట్లాడటం మానేసింది. ఆమెకు కోపం వచ్చిన సంగతి చూసి అతను ఆమెకు క్షమాపణలు చెప్పుకున్నాడు, బతిమాలాడు. అతను ఆ క్షమాపణ తిట్లు తిన్నవాడికెందుకు చెప్పలేదో నాకిప్పటికీ అర్థం కాలేదు.

"మీ ప్రపంచంలో జీవశక్తి దుర్వ్యయం అవుతున్నదని నా నిశ్చితాభిప్రాయం. ఆ విషయంలో మీ కన్న జంతువులు చాలా ఉన్నతమైన స్థితిలో ఉన్నై. మీరు ప్రకటించే ఉద్రేకానికీ, సాధించే జ్ఞానానికీ, తగిన ఫలితం రానే రావటం లేదు. మీలో విమర్శనా దృష్టి తగినంత లేకపోవటం వల్ల ఆ సంగతి తెలుసుకోకుండా ఉన్నారు.

"నా సలహా ఏమంటే, మీరు కొంతకాలంపాటు జ్ఞానాన్ని, సంస్కారాన్నీ విసర్జించి పశుతవం అవలంభిస్తే మీ జాతికి మళ్ళీ పునర్జన్మ కలగవచ్చును. ఒక్కసారి తప్పుదోవను వెళ్ళిన అనుభవం జాతికి తప్పకుండా వినియోగపడుతుంది. మీ పునర్జన్మ మీ ఈ జన్మకంటే తప్పకుండా బాగుంటుంది."

## 4

ఈ నిష్పాక్షికాభిప్రాయాన్ని అత్యాశ్చర్యంతో విన్నాను.

"మీ జ్ఞానం నా చెవులకు వింతగా ఉన్నప్పటికీ మీ ధోరణి కొంతవరకు నాకు

సులభ గ్రాహ్యంగానే ఉంది. మాకూ మీ గంధర్వులకూ నేనూహించిన దానికంటే ఎక్కువ సన్నిహిత సంబంధం ఉండి ఉండాలి. లేకపోతే మీ మాటలు నాకర్థమై ఉండవు" అన్నాను.

"దానికేమీ సందేహం లేదు!" అన్నాడాయన. "మానవులు శ్రమపడితే గంధర్వులతో సులభంగా పరిచయం సంపాదించవచ్చును. నేను మీ భూలోకపు జీవితం సులభంగా అర్థం చేసుకోగలిగాను. ఇవాళ ఉదయం అమెరికాలో - అక్కడ అప్పుడే పొద్దుగూకింది- హాలీవుడ్ చూస్తూ అక్కడ కనిపించిన ఒకరిద్దరు స్త్రీల మీదికి నా మనస్సు వెళ్ళటం గమనించి ఆశ్చర్యపడ్డాను. మా ప్రపంచంలో నేను విశేషంగా మా తురుడి కింద లెక్కలోకి రాను. అక్కడ మా స్త్రీ పురుషులు నగ్నంగా ఉంటారు. మీ ప్రపంచంలో శరీరాలు త్వరగా అందం చెడిపోతై; కనక మీరు బట్టలు కట్టుకోవటం తప్పనిసరి అనుకుంటాను. నగ్న స్త్రీ నన్ను ఆకర్షించలేనట్టే నిండు బట్టలు కట్టుకున్న మనిషి కూడా నన్నాకర్షించలేదు. కాని అమెరికాలో కొద్దిపాటి దుస్తులు ధరించిన స్త్రీలు నన్ను అమితంగా ఆకర్షించారు.

"ఇంతకూ నేను భూలోకంలోకి వచ్చిన కారణం చెప్పలేదు. వీలయితే ఇక్కడ ఉండిపోదామనే ఉద్దేశంతోనే నేను వచ్చాను. విషయమేమంటే నేనూ మా ప్రపంచంలో బొత్తిగా అనామకుణ్ణి - అసలే గంధర్వులు దేవతలలో తక్కువ జాతి. కొంతకాలంనించీ నా తక్కువతనం నన్ను బాధిస్తూ వచ్చింది. నీ మాదిరిగానే నేను అసంతృప్తి ముఖ్య లక్షణంగా కలవాణ్ణి, విప్లవ ప్రియుణ్ణి, సంస్కారాభిలాషిని. కాని మా ప్రపంచంలో ఎటువంటి సంస్కారానికీ నా కవకాశం కనిపించలేదు. మాకు సంస్కారం అవసరం లేదని కాదు; అటువంటి సంస్కారం గురించి నేను ఆలోచించే లోపుగా నాకన్నా ముందుగానే ఎవరో ఒకరు నేను చెయ్యదగినపని చేసేస్తారు.

"ఆఖరుకు నాకు భూలోకం కనిపించింది. ఇక్కడ జీవితాన్ని సంస్కరించి ఖ్యాతి సంపాదించామని వచ్చాను. నాకంటే అన్ని విషయాలలోనూ హీనులయిన వాళ్ళ సమాజంలో వచ్చిపడితే నా ఆత్మకు చాలా తృప్తి కలుగుతుందనిపించింది. మామూలు సుఖంతో నాకు మొహం మొత్తిపోయింది. నాకు కష్టాల మీద వాంఛ కలిగింది. కష్టాలను ఎదుర్కుంటే కాని నాకు నిజమైన ఆనందం కలగదనిపించింది. బయలుదేరి వచ్చాను. కామగమనం వల్ల చూడవలసింది యావత్తూ చూశాను. వచ్చి ఇంకా అరవై గడియలైనా కాక పూర్వమే నాకు మా ప్రపంచం మీద దృష్టి మళ్ళింది.

"నే నిప్పుడొకటి తెలుసుకున్నాను. మనకు ఏ వాతావరణంలో ఒక మనో వికారం కలుగుతుందో ఆ వికారంతోపాటు ఆ వాతావరణం కూడా పోతే తృప్తి కలగదు. ఆ వాతావరణంలోనే ఆ వికారానికి విరుగుడు కలగాలి!" అన్నాడు గంధర్వుడు.

"అయితే మీరు మా ప్రపంచం విడిచి పెట్టటానికి నిశ్చయించారా?" అన్నాను.

"అవును. ఎప్పుడెల్లి మా కల్పవనాల్లో పడదామా అనిపిస్తుంది. మీలోకపు కుళ్ళును స్వయంగా చూసేటప్పటికి సంస్కరించాలనే అభిలాష దూరమై, తొలగిపోదామనే వాంఛ ప్రజల మవుతున్నది."

"మేము నిజంగా దురదృష్టవంతులం. మీకున్న జ్ఞానం చూస్తే మీరు మీ ప్రపంచంలో సామాన్య వ్యక్తి అని నా కనిపించటం లేదు. మీ జ్ఞానం మా మానవ జాతికి వినియోగించగలిగితే" -

గంధర్వుడు నా కడ్డం వచ్చి, "హృదయం అడ్డుతగలనంతవరకూ అందరమూ జ్ఞానులమే. మన విషయాలను గురించి ఆలోచించేటప్పుడు మన హృదయం నిర్వికారహంగా ఉండలేదు. కనుకనే జ్ఞానంతో మనని మనం విమర్శించుకోలేకపోతాం. మీ ప్రపంచాన్ని గురించి మాట్లాడేటప్పుడు నా అంత జ్ఞానీ, వివేకీ ఉండడు. నిన్ను మా ప్రపంచానికి తీసుకుపోతే అక్కడ నువు మా అందరికన్నా ఎక్కువ జ్ఞానం ప్రకటిస్తావు. నహుషుడేం చేశాడు? అంత మంచి ఇంద్రుడు స్వర్గానికి ఎన్నడూ లభించలేదన్నారు. కాని అతనికి స్వర్గజీవితం మొహం మొత్తింది. అతని ఆత్మ భౌతిక వాతావరణం కోసం తహ తహ లాడసాగింది; కాని ఆ సంగతి పైకి అన సాహసించలేక పోయినాడు. ఆఖరుకు అతనికి వెర్రెత్తిపోయింది. ఆ వెర్రే అతనికి భూలోక ప్రాప్తి ఇచ్చింది. అతను ఇంద్రుడు గడిపిన కొద్ది కాలంలోనూ పొందలేని హాయి వెయ్యి సంవత్సరాలు అజరామరంగా ఉండి పొందాడు" అన్నాడు.

"ఇతరుల సంగతి ఏమో కాని నేను మీ గంధర్వ లోకం వస్తే చాలా సుఖిస్తాననుకుంటాను. స్వర్గం నాకక్కర్లేదని ఎన్నడో తీర్మానించుకున్నాను. మా లోకపు పరిస్థితులకు దగ్గిరిగా ఉండి, ఇక్కడి కుళ్ళంతా లేని ప్రపంచం ఏదన్నా ఉంటే అక్కడికి పోవటానికి నాకేమీ అభ్యంతరం లేదు. నన్నేవిధంగానన్నా మీ గంధర్వలోకం చేర్చగలరా?" అని నేను గంధర్వుణ్ణి అడిగాను.

ఆయన నాకేసి చాలాసేపు నిర్ఘాతంపోయినట్టు చూసి, "నిన్ను మా లోకానికి తీసుకుపోవటం అసాధ్యం కాదు కాని–" అని ఆగాడు.

"మీ రేమీ అనుమానించవద్దు. నాకీ భూలోకపు జీవితంలో ఎంత రోత పుట్టిందో మీరెరగరు. నేను మనుష్యమాత్రుడితో ఇంతసేపూ ఇట్లా కూర్చుని సంభాషించలేదని నమ్మండి. నాయందు అనుగ్రహం ఉంచి నన్ను మీ ప్రపంచం చేర్చండి. అక్కడ అధమాతి అధముడుగా ఉండటానికైనా ఒప్పుకుంటాను!" అని ప్రాధేయపడ్డాను.

గంధర్వుడు తల పంకించి, "అయితే పోదాం, లే" అన్నాడు. నేనొక్క గంతువేసి లేచి నిలబడ్డాడు.

# 5

మేము గంధర్వలోకం ఎట్లా చేరుకున్నామో నాకు జ్ఞాపకం లేదు. ఆ వాతావరణంలో నాలో మొదట్లో కలిగించిన ఆనందం చెప్పలేను. ఎక్కడ చూసినా సౌందర్యం ఉట్టిపడుతున్నది. అంత నిష్కళంకమైన సౌందర్యం నేను కలలోకూడ ఊహించలేదు. ఆ చెట్లమీద ఒక ఎండుటాకుగాని ఒక ఎండు రెమ్మగాని లేదు. ఆ పచ్చిక బయళ్ళలో ఒక అంగుళం మేర అయినా మట్టి కనిపించటం లేదు. అక్కడి చప్పుళ్లే శ్రుతియుతంగా వినిపించినై.

అక్కడి స్త్రీ పురుషులంతా దిగంబరులు. కాని వారి అందం! దిగంబరత్వం వారికి చెల్లిపోయింది. ఎవరి మొహం చూసినా చిరునవ్వుతో కూడుకుని ఉంది. ఎక్కడా ఏడుపులు కాని కేకలుగాని వినిపించలేదు.

నా వెంట ఉన్న గంధర్వుడు నన్ను అనేకమంది స్త్రీ పురుషులతో పరిచయం చేశాడు. అందులో ఒక పిల్ల నావంక మెరిసే కళ్ళతో చూసి నా చెయి పట్టుకుని, "నాతోరా! నీకు మా ప్రపంచపు వింతలన్నీ చూపిస్తాను!" అన్నది. నేను నా స్నేహితుడికేసి అనుమానిస్తూ చూశాను. ఆయన తల ఊపాడు.

నేనూ ఆ పిల్లా కలసి అతివేగంగా గంధర్వ ప్రపంచం యావత్తూ పర్యటనం చెయ్యసాగాం.

నా స్నేహితురాలు వసపోసిన పిట్ట మోస్తరుగా విడవకుండా మాట్లాడుతూనే ఉంది. కాని ఆమె చెప్పే విషయాలు కొంతవరకు నాకర్థము కాలేదు. మిగిలినవి తెలుసుకోదగినవిగా కనిపించలేదు. ఆ ప్రపంచాన్ని ఎంత వివరంగా చూసినప్పటికీ నాకు అర్థమయింది, ఒకటే సంగతి – భూలోకంలో కంటె ఇక్కడ ఆనందం హెచ్చుగా ఉంది, అందమూ హెచ్చుగానే ఉంది.

"మీ ప్రపంచము అన్ని మూలలా నాకు ఒకటిగానే ఉంది. అది నా దృష్టిలోపమేమో. అంతసేపటినుంచీ చూసిన ప్రదేశం చూడకుండా చూస్తున్నాం కాని నాకు క్రొత్త క్రొత్త వింతలు చూస్తున్నట్టుగా లేదు!" అన్నాను నా స్నేహితురాలితో.

"కొంతకాలం ఈ ప్రపంచానికి అలవాటు పడితేకాని ఆ తేడా తెలియదు. మా ప్రపంచంలో ఏ రెండు చెట్లు, ఇళ్ళూ, తోటలూ, మైదానాలూ ఒకటిగా ఉండవు. దేని ప్రత్యేకత, దేని అందం దానిదే!... ఇక ఈ పర్యటనం కట్టిపెట్టి మా ఇంటికిపోయి మనిద్దరమూ వినోదింతాం. మానవుడితో క్రీడించటం ఎట్లా ఉంటుందో తెలుసుకుందామని

అభిలాషగా ఉంది. నీకు కూడా గంధర్వ స్త్రీ సమాగమం అనుభవం ఉండి ఉండదు!" అన్నది స్నేహితురాలు.

ఈ మాటలు చెవిని పడగానే నా రక్తం ఉడికిపోయింది. ఆ క్షణం వరకూ నా మనసు అప్పుడప్పుడూ ఆమె మీదికి పోతూ ఉండింది. ఆ సౌందర్యాన్ని అనుభవిస్తే, ఆ సుకుమార శరీరాన్ని తాకితే, ఆమె నిత్య యౌవనం అనుభవిస్తే ఎంత ఆనందంగా వుంటుందో అని ఆశ్చర్యపడుతున్నారు. కాని ఆమె కుండ పగలేసి అట్లా మాట్లాడేటప్పటికి నాకు వాంతి అయ్యేటంత పని అయింది. గంధర్వ స్త్రీ కాదు, అంతకు మించిన రంభ అయినా సరే నా మీద తనకున్న వాంఛ అట్లా బయటపెడితే నేను సహించి ఉండను. ప్రవరుడు వరూధినిని చూసి అసహ్యించుకుని ఉండటం నాకిప్పుడర్థమయింది.

"నువ్వు నన్ను మోహించావా?" అన్నాను.

"అవును!" అన్నది గంధర్వ స్త్రీ.

"మాలో మోహించానని చెప్పటం ఆచారం కాదు."

"మీలో స్త్రీ పురుషులు కామించరా!"

"కామిస్తాం. కాని ప్రేమిస్తేగాని ఒకరినొకరు వాంఛించం. ప్రేమించనప్పుడు కూడా ప్రేమించామనే చెప్పుకుంటాం."

"ప్రేమంచటమంటే?"

ఏం చెప్పాలి? "మీలో ప్రేమించరా?" అన్నాను.

"అదేమిటో తెలిస్తేనా?

"ప్రేమించట మనేది అనుభవం కావాలి కాని నిర్వచించటం కష్టం. ఇటు చూడు. నేను నా హృదయం నీకు అర్పణం చేసినప్పుడు, నీకోసం సమస్తమూ త్యాగం చెయ్యటానికి నేను ఉద్యుక్తుణ్ణయినప్పుడు, నేను నిన్ను ప్రేమిస్తున్నానన్నమాట. తెలిసిందా?"

"హృదయ మంటే?"

"హృదయమంటే తెలియదా? ఉద్రేకం తెలుసునా?" ఉద్రేకం కలిగించేది హృదయం!"

"మాకు ఉద్రేకాలు కలగవు!" అన్నది ఆ దేవత.

"నీకిప్పుడు నా మీద కలిగిందేమిటి?" అన్నాను.

"వాంఛ"

"అది ఎక్కడుందంటావు?"

"నా మనస్సులో! ఇంకెక్కడా?"

"వాంఛను మనస్సుద్వారా తెల్సుకుంటావా?"

"మరేమిటి?" అన్నదామె ఆశ్చర్యంతో.

తీరిపోయింది. ఈ గంధర్వులకు హృదయాలు లేవని తెలుసుకోవటానికి నాకింతకాలం పట్టింది. అందుకనే ఆ ప్రపంచంలో స్వేచ్ఛా ప్రణయం సాధ్యమయింది. మానవుడు కూడా స్త్రీ పురుష సంబంధాన్ని గురించి కేవలమూ మనస్సుతోనే ఉద్రేకం లేకుండా ఆలోచించ గలిగిన రోజున నీతి పోయింది. నే నింతకాలమూ ఆ తప్పుదోవలోనే ఉన్నాను. నిజంగా మన్మథ వ్యాపారం నుంచి హృదయమనేది తీసివేస్తే ఆ వ్యాపారమందు మానవుడికి నిజమైన ఆనందం ఉంటుందా? ఈ మనిషి నన్ను అడగగానే పుట్టిన విముఖత్వమే పుడుతుందేమో!

"నాకు నీ మీద వాంఛ కలుగనందుకు చాలా చింతిస్తున్నాను!" అన్నాను. చలనం లేని ఆమె కళ్ళకేసి చూస్తుంటే నాకు నిజంగానే విముఖత్వం కలగసాగింది ఆమెమీద.

"పోనీ, దానికేం?" అన్నదామె. ఆమెకు నా మీద ఏమాత్రము కోపం వచ్చినట్టు కనిపించలేదు. మేము చేతులు పట్టుకుని సాగిపోయినాం. అందరూ నాకేసి విచిత్రంగా చూడటం గమనించాను.

"ఎందుకిట్లా శరీరాన్ని కప్పుకున్నావు? ఈ తొడుగు తీసేసి మా మాదిరిగా తిరగరాదు?" అన్నదామె నా గుడ్డ పట్టి లాగుతూ. నేను చప్పున మానం రక్షించుకోక పోయినట్టయితే ప్రమాదం జరిగి ఉండును. ఊడిపోయిన కుచ్చిళ్ళు మళ్ళా దోపుకుంటూ కోపంగా, "అట్లా ఎప్పుడూ చెయ్యకు, నా కసహ్యం!" అన్నాను.

ఆమె ప్రకటించిన ఆశ్చర్యం వర్ణనాతీతం. నా ఉద్రేకం ఆమెకు చాలా మోటుగా కనిపించి ఉండాలి. నేను వెంటనే క్షమాపణ చెప్పాను. "క్షమించు! అసలు సంగతేమంటే మా మానవ శరీరాలు చాలా అందవిహీనమైనవి. మీ గంధర్వులు నన్నీ ఆచ్ఛాదన లేకుండా చూస్తే అసహ్యించుకుంటాను." అన్నాను. నా కోపం ఎంత ఆశ్చర్యకరంగా ఉండిందో, నా పశ్చాత్తాపం కూడా ఆమెవంక ఆశ్చర్యకరంగా ఉండి ఉండాలి.

ఆమె నవ్వి "ఎంత విచిత్రమైన ప్రాణివి!" అన్నది.

ఇంతలో ఒక గంధర్వుడు మావైపు వచ్చాడు. అతను నా స్నేహితురాలిని సమీపించి, "మా యింటికిపోయి కాసేపు ఆనందంగా గడుపుదాం, వస్తావా!" అన్నాడు, నా స్నేహితురాలు, "పోదాం పద!..." అన్నది. ఆమె నాతో పోతున్నానని చెప్పలేదు.

ఆ గంధర్వుడి మీద నాకు చెప్పరాని అసూయ కలిగింది. ఆమె మీద నాకు విముఖత్వం కలిగినప్పటికి ఆమె నన్ను మోహించినందుకు నేను గర్వపడ్డాను. ఆమె నిశ్చింతగా మరొకడి వెంట పోగానే నాకు గర్వభంగమయింది. ఆమె నన్ను వాంఛించినప్పుడు ఎందుకు అంగీకరించకపోతినా అని దిగులు పడసాగాను.

నేను ఒంటరిగాణ్ణయి పోయినాను. ఏం చెయ్యటానికీ పాలు పోలేదు. నా స్నేహితురాలు నా హృదయంలో పెట్టిపోయిన చిచ్చు రగులుతున్నది. దాన్ని ఎట్లాగయినా ఆర్పాలి.

ఇంతలో దేవుడు పంపించినట్టు మరొక గంధర్వ స్త్రీ ఆ దారినే వచ్చింది. నేను ధైర్యంగా ఆమెను సమీపించి, "మీ ఇంటికి పోదామా? నాకు నీతో కొంచెంసేపు సుఖించాలని ఉంది!" అన్నాను. కాని నా గొంతు వణికింది.

"పోదాం, రా!" అన్నదామె. ఏ మాత్రమూ ఉత్సాహం లేకుండా; ఇద్దరము కలిసి ఆమె ఇంటికి వెళ్ళాము. గంధర్వ స్త్రీ పొందంటే ఏమిటో నాకు తెలిసిపోయింది. నా ఉద్రేకమూ నా మొరటుతనమూ చూసి ఆ మనిషి ఆశ్చర్యపడిపోయింది. ఆమె నిర్లిప్తత చూసి నేను ఆశ్చర్యపడ్డాను. ఇద్దరమూ వృధా కాలక్షేపం చేసినందుకు చంపలు వాయించుకొని ఒకరి దగ్గర ఒకరం శెలవు పుచ్చుకున్నాం. నేను వెయ్యి సంవత్సరాలలో కూడ గంధర్వస్త్రీని తాత్కాలికంగా కూడా ప్రేమించలేను. ఆమె నా కింటికి పశువుగా కనిపిస్తున్నది. నే నామెకు అంతకంటె పశువుగా కనిపిస్తాను. ప్రేమించకుండా నేను స్త్రీ వల్ల సుఖం పొందలేను.

గంధర్వ స్త్రీల మీది విముఖత్వం ద్వారా గంధర్వలోకం మీది విముఖత్వం కూడ పైకి వచ్చేసింది. ఈ ప్రపంచం అందంగా ఉండుగాక, ఈ అందమే నన్నీ ప్రపంచానికి అంటకుండా చేస్తున్నది. నా ప్రవృత్తిలో అందాన్ని ఆనందించటమే కాక అనాకారితనాన్ని చూసి అసహ్యించుకోవటం కూడా ఉంది. ఈ గంధర్వులకు ఆ రెండోది చేతకాదు. అందాన్ని ఆనందించటం మెదడుకు సంబంధించినది. వీళ్ళకు హృదయం లేదు. వీరి కంటికి అందంగా లేనిదాన్ని ఏ మాత్రము ఉద్రేకము లేకుండా నాశనం చేస్తారు. అంతేకాని ద్వేషించటం వీరెరుగరు.

భూలోకంలో కూడ నేనిదే గమనించాను. నేను అందమైన భవనాలు చూశాను. అందగత్తెలయిన స్త్రీలను చూశాను. వాటివల్ల ఆనందం కలిగినా వాటియందు మమకాలం నాకెన్నడూ కలుగలేదు. "ఇది నాదికాదు!" అనే భావమే కలుగుతూ ఉండేది.

ఈ ప్రపంచం కూడ నన్ను ఆకర్షించింది. కాని నాలో "ఇది నాదే!" అనే విశ్వాసం అణుమాత్రమైనా కలిగించలేకపోయింది.

అణుక్షణం భూలోకానికి తిరిగి పోవాలనే వాంఛ ప్రబల మవుతున్నది. కాలు కాలిన పిల్లి మోస్తరుగా నా స్నేహితుడి కోసం వెదకసాగాను. ఆయన సహాయం లేకుండా ఎట్లా తిరిగిపోవటం? ఆయన ధర్మమా అని ఆయన ఆఖరుకు నాకు మళ్ళీ దొరికాడు.

"ఎట్లా ఉంది మా ప్రపంచం? మీ లోకం నుంచి తిరిగి వచ్చిన తరువాత మా ప్రపంచం మీద నాకు అభిమానం జాస్తి అయిందని ఒప్పుకుంటాను!" అన్నాడాయన.

"నాకు మా ప్రపంచం మీద అనురాగం జాస్తి అయిందని చెప్పలేను కాని మీ ప్రపంచం మీద అనురాగం మాత్రం కలుగలేదు," అన్నాను.

"ఏమీ?" అన్నాడాయన ఆశ్చర్యంతో. "ఈ సౌందర్యం యావత్తూ నీకు రుచించలేదా?"

"రుచించింది! కాని మీ ప్రపంచంలో నాకు కావలస్సినవి కొన్నిలేవు. ఇంతకు పూర్వమే మా దొడ్లోవున్న ఎండు చెట్టొకటి జ్ఞాపకం వచ్చి ఏడుపొచ్చింది. అట్లా హృదయాన్ని కదిలించే దృశ్యం మీ ప్రపంచంలో ఒక్కటి చూపండి! ఒక ఆర్తనాదం, కోపంలో తీవ్రంగా లేచిన ఒక కంఠస్వరం, మా పొలాలమీద వినిపించే ఒక స్వర రహితమైన పాట! – ఇక్కడ ఏముంది? అందరూ స్థాయిల ప్రకారం మాట్లాడతారు. నాకిక్కడ బాగాలేదు. కోపమూ, ఏడుపు, జాలో, నవ్వో, రాకుండ నేను కాలం గడపలేను. నేను జీవిస్తున్నదే ఆ ఉద్రేకాల మీద. ఆఖరుకు పశ్చాత్తాప పడటానికైనా అవకాశం ఇవ్వదు మీ ప్రపంచం. మీ ప్రపంచంలో తప్పు చెయ్యటానికైనా అవకాశం లేకుండా చేసుకున్నారు. లిఖితా లిఖిత శాసనం మా ప్రపంచంలో బోలెడంత ఉంది – తప్పుచేసి చంపలు వాయించుకొనేటందుకు. నే వెళ్ళిపోతాను. నన్ను దయవుంచి మళ్ళీ మా లోకంలో దింపి వేయండి!" అన్నాను.

ఆ గంధర్వుడు తల వూపి "నేను మొదటనే ఇట్లా అవుతుందనుకున్నాను పోదాం పద!" అన్నాడు.

***ముద్రణ: భారతి, మార్చ్ 1940***